Neti Velugu

నేటి వెలుగు

నేటి సమాజం... నేటి వెలుగు...

తెలుగు దినపత్రిక

RNI NO. TELTEL/2023/88559

www.epaper.netivelugu.com

netivelugu63@gmail.com

హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైన మహిళా జర్నలిస్టుల జాతీయ సదస్సు

4



నల్గొండ | సంపుటి : 3 | సంచిక : 191 | పేజీలు : 8 | అక్టోబర్ 25 ఆదివారం 2026 | వెల రూ. 4.00/-

NALGONDA | VOL:3 | ISSUE: 191 | PAGES:8 | SUNDAY OCTOBER 25 2026 | Rs. 4:00

కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం వాయిదా..

మహారాష్ట్రకు సీఎం రేవంత్ రెడ్డి



- సోమవారం జరగాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం వాయిదా
- తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు బోర్డు నిర్ణయం
- సీఎం రేవంత్ రెడ్డి ముంబై పర్యటన కారణంగా అధికారులు హాజరుకాలేరని వెల్లడి
- మంగళవారానికి సమావేశాన్ని తిరిగి షెడ్యూల్ చేసిన కేఆర్ఎంబీ

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా నదీ జలాల పంపిణీపై చర్చించేందుకు సోమవారం (అక్టోబర్ 26) జరగాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) 21వ సమావేశం వాయిదా పడింది. తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ఈ భేటీని మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు బోర్డు ప్రకటించింది.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ముంబై పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరు కాలేరని తెలంగాణ ఇంజనీర్-ఇన్-చీఫ్ కేఆర్ఎంబీకి లేఖ ద్వారా తెలియజేశారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టుకు సంబంధించిన కీలక చర్చల నిమిత్తం ముఖ్యమంత్రి మహారాష్ట్రకు

(మిగతా 2వ పేజీలో..)

వస్తోంది తుపాను కాదు.. అతి తీవ్ర తుపాను.. ఏపీకి ఐఎండీ హెచ్చరిక

- బంగాళాఖాతంలో వాయుగుండం.. అతి తీవ్ర తుపానుగా మారే సూచన
- అక్టోబర్ 28న ఏపీ తీరాన్ని తాకవచ్చని అంచనా
- బాపట్ల-విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం
- తీరం దాటే సమయంలో గంటకు 115-125 కి.మీ వేగంతో గాలులు
- ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరాలకు 'ప్రీ-సైక్లోన్ వాచ్' జారీ

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారింది. ఇది వేగంగా బలపడుతూ ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొస్తోంది. ఇది రానున్న కొద్ది రోజుల్లో 'అతి తీవ్ర తుపాను'గా మారి రాష్ట్రంపై పెను ప్రభావం చూపనుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. అక్టోబర్ 28న బాపట్ల-విశాఖపట్నం మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, యానాం తీర ప్రాంతాలకు 'ప్రీ-సైక్లోన్ వాచ్' జారీ చేసింది.న్యూఢిల్లీలోని ప్రాంతీయ వాతావరణ కేంద్రం శనివారం విడుదల చేసిన ప్రత్యేక బులెటిన్

(మిగతా 2వ పేజీలో..)



'ఇండియా' కూటమి ర్యాలీ వద్దు.. రూ. 10,000 కోట్ల నష్టం వస్తుంది!: రాహుల్ గాంధీకి వ్యాపారుల విజ్ఞప్తి

- నవంబర్ 1న ఢిల్లీలో 'ఇండియా' కూటమి ర్యాలీ
- వాయిదా వేయాలని వ్యాపారుల విజ్ఞప్తి
- దీపావళి సీజన్‌లో రూ.10,000 కోట్ల వ్యాపారం నష్టపోతామని వర్తక సంఘం ఆందోళన
- రామ్‌లీలా మైదానం పరిసరాల్లోని 20 మార్కెట్లపై ర్యాలీ ప్రభావం చూపుతుందని వెల్లడి
- నిరసన తెలిపే హక్కు ఉన్నప్పటికీ, పండగ తర్వాత ర్యాలీ నిర్వహించాలని కోరిక



ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నవంబర్ 1న 'ఇండియా' కూటమి నిర్వహించ తలపెట్టిన భారీ ర్యాలీని వాయిదా వేయాలని వ్యాపార వర్గాలు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని కోరాయి. దీపావళి పండగ

(మిగతా 2వ పేజీలో..)

సీఎం విజయ్ కీలక నిర్ణయం.. ప్రశంసించిన కేంద్రం!

- తమిళనాడు సీఎం విజయ్ ప్రభుత్వానికి కేంద్ర మంత్రి ప్రశంసలు
- చెన్నై విమానాశ్రయంలో ఏటీఎఫ్ వ్యాట్ 29 నుంచి 16 శాతానికి తగ్గింపు
- నవంబర్ 1 నుంచి 2027 అక్టోబర్ 31 వరకు రాయితీ అమలు
- నిర్ణయాన్ని స్వాగతించిన ఇండిగో విమానయాన సంస్థ





విమాన కనెక్టివిటీ, పర్యాటక రంగానికి ప్రయోజనం

(మిగతా 2వ పేజీలో..)

కేంద్ర నిధులపై తెలంగాణ సర్కార్ ఫోకస్: అధికారులకు సీఎస్ సంజయ్ జాజు కీలక ఆదేశాలు

- కేంద్ర ప్రాయోజిత పథకాలపై సీఎస్ సంజయ్ జాజు సమీక్ష
- నిధుల రికవరీ, వినియోగం వేగవంతం చేయాలని ఆదేశం
- కేంద్ర అధికారులతో సమన్వయం పెంచుకోవాలని సూచన
- అవసరమైతే కేంద్ర కార్యదర్శులతో తానే చర్చిస్తానని వెల్లడి
- హైదరాబాద్ సచివాలయంలో ఉన్నతాధికారులతో సమావేశం

కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రాష్ట్రానికి అందాల్సిన నిధులను సత్వరమే రాబట్టి, వాటిని సమర్థవంతంగా

(మిగతా 2వ పేజీలో..)



కాళేశ్వరంపై బీఆర్ఎస్ నేతలవి హేతుబద్ధత లేని విమర్శలు!

కేటీఆర్, హరీశ్‌రావుపై మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ధ్వజం

బ్యారేజీల మరమ్మతులు పూర్తయ్యే వరకు గేట్లు బించలేం

కాళేశ్వరం నిర్మాణమే తప్పుడు నిర్ణయం.. ప్రాణహిత--చేవెళ్లతో ఎక్కువ ప్రయోజనం

(మిగతా 2వ పేజీలో..)



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి తెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్
ఎడిటర్ & పబ్లిషర్

కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం వాయిదా.. మహారాష్ట్రకు సీఎం రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

వెళుతున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ కారణం చేత సమావేశాన్ని వాయిదా వేయాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న కేఆర్ఎంబీ, సమావేశాన్ని మంగళవారానికి రీషెడ్యూల్ చేసింది. ఈ మార్పునకు సంబంధించిన సమాచారాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు అధికారికంగా తెలియజేసింది. తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాలు, నీటి పంపిణీకి సంబంధించిన కీలక అంశాలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నారు.

'ఇండియా' కూటమి ర్యాలీ వద్దు.. రూ. 10,000 కోట్ల నష్టం వస్తుంది!: రాహుల్ గాంధీకి వ్యాపారుల విజ్ఞప్తి

(మొదటి పేజీ తరువాయి)

సీజన్‌లో ఈ ర్యాలీ నిర్వహిస్తే సుమారు రూ.10,000 కోట్ల మేర వ్యాపార నష్టం వాటిల్లుతుందని ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి సీటీఐ ఛైర్మన్ బ్రిజేష్ గోయల్ లేఖ రాశారు.పండగ సీజన్‌ను దృష్ట్యాలో ఉంచుకుని నవంబర్ 10 తర్వాత ర్యాలీని నిర్వహించాలని ఆయన ఆ లేఖలో సూచించారు. నవంబర్ 6న ధంతేరస్, నవంబర్ 8న దీపావళి ఉన్న నేపథ్యంలో కొనుగోళ్ల కోసం ప్రజలు భారీగా మార్కెట్లకు వస్తారని, ఈ సమయంలో ర్యాలీ నిర్వహిస్తే వాణిజ్య కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. దీపావళి పండగ వేళ ఢిల్లీ వ్యాప్తంగా బంగారం, వెండి, ఎలక్ట్రానిక్స్, వస్త్రాలు, గృహోపకరణాలు, డ్రై ఫ్రూట్స్, స్వీట్లు, వాహనాలు, స్థిరాస్తి, గిఫ్ట్ ఆర్టికల్స్ వంటి అన్ని రంగాల్లో కలిపి సుమారు రూ.25,000 కోట్ల మేర వ్యాపారం జరుగుతుందని సీటీఐ అంచనా వేసింది.రామ్‌లీలా మైదానానికి ఐదు కిలోమీటర్ల పరిధిలోనే చాందినీ చౌక్, సదర్ బజార్ వంటి సుమారు 20 హోల్‌సేల్, రిటైల్ మార్కెట్లు ఉన్నాయని, ర్యాలీ కారణంగా విధించే ట్రాఫిక్ ఆంక్షలతో ఈ ప్రాంతమంతా స్తంభించిపోయే ప్రమాదం ఉందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత అక్టోబర్ మాసంలో సెంట్రల్ ఢిల్లీలో జరిగిన పలు ర్యాలీలు, రహదారుల మూసివేత వల్ల ఇప్పటికే వ్యాపారులు రూ.3,000 కోట్ల వరకు నష్టపోయారని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఓటర్ల జాబితా సవరణలో "ఓట్ల చోరీ" జరిగిందన్న ఆరోపణలతో, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'ఇండియా' కూటమి ఈ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చింది. అయితే, శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును తాము గౌరవిస్తామని, పండగ సీజన్ ముగిసే వరకు వాణిజ్య ప్రాంతాలకు దూరంగా ర్యాలీలు నిర్వహించాలని సీటీఐ రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేసింది.

కాళేశ్వరంపై బీఆర్ఎస్ నేతలవి హేతుబద్ధత లేని విమర్శలు!

హైదరాబాద్, అక్టోబరు 24: కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ విషయంలో బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు హేతుబద్ధత లేని విమర్శలు చేస్తున్నారని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మండిపడ్డారు. రాజకీయ దురుద్దేశంతో ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. శనివారం సచివాలయంలో కార్మిక శాఖ మంత్రి జి.వివేక్, ఎమ్మెల్యేలు బీర్ల అయిలయ్య, గ్యాదరి బాలమల్లు, పటోళ్ల సంజీవ్‌రెడ్డి, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు.మేడిగడ్డ బ్యారేజీ గేట్లు దించితేనే కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని పంపింగ్ చేయడం సాధ్యమవుతుందని, అయితే ఏడో బ్లాక్ పునరుద్ధరణతోపాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులు పూర్తికాకుండా గేట్లు దించలేమని స్పష్టం చేశారు.

గేట్లు తెరిచే ఉంచాలని ఎన్‌డీఎస్‌ఏ సూచన

మూడు బ్యారేజీల గేట్లను తెరిచే ఉంచాలని జాతీయ ఆనకట్టల భద్రతా ప్రాధికార సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) సిఫారసు చేసిందని ఉత్తమ్ తెలిపారు. బ్యారేజీల భద్రతను దృష్టిలో ఉంచుకుని పునరుద్ధరణ పనులు చేపడుతున్నామని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా పనులు నిర్వహిస్తుంటే బీఆర్ఎస్ నేతలు అర్థంలేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

రూ.1.80 లక్షల కోట్లు ఖర్చు చేసినా ప్రాజెక్టులు పూర్తి కాలేదు

బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేళ్ల పాలనలో నీటిపారుదల శాఖపై రూ.1.80 లక్షల కోట్లు ఖర్చు చేసినప్పటికీ ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదని ఉత్తమ్ ఆరోపించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలకు బీఆర్ఎస్ పాలనలో తీసుకున్న నిర్ణయాలే కారణమని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ నిర్ణయమే తప్పిదమని వ్యాఖ్యానించారు.

ప్రాణహిత--చేవెళ్లతో 16.5 లక్షల ఎకరాలకు నీరు వచ్చేది

కాళేశ్వరం ప్రాజెక్టు కోసం ఖర్చు చేసిన నిధుల్లో రూ.38 వేల కోట్లు ప్రాణహిత--చేవెళ్ల ఎత్తిపోతల పథకానికి వినియోగించి ఉంటే, తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణం పూర్తయ్యేదని ఉత్తమ్ పేర్కొన్నారు. తద్వారా 16.5 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉండేదని అన్నారు. కమీషన్ల ప్రయోజనాల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని ఆరోపించారు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం, కుంగిన ఘటన రెండూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని గుర్తుచేశారు.

హరీశ్‌రావు సవాలుపై మంత్రి ఘాటు స్పందన

ఆరు నెలలు అవకాశం ఇస్తే కాళేశ్వరం బ్యారేజీలకు మరమ్మతులు చేసి చూపిస్తానంటూ హరీశ్‌రావు చేసిన సవాలుపై ఉత్తమ్ తీవ్రంగా స్పందించారు. గతంలో నీటిపారుదల శాఖ మంత్రిగా హరీశ్‌రావును పదవి నుంచి తొలగించిన విషయాన్ని ప్రస్తావిస్తూ విమర్శలు చేశారు. బ్యారేజీల రూపకల్పన సమయంలో షీట్ పైల్స్ వినియోగించాల్సి ఉండగా, సీకెంట్ పైల్స్ వినియోగానికి అనుమతి ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. ఆ నిర్ణయం వెనుక కారణాలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

కాళేశ్వరం నిర్ణయాలపై వివేక్ విమర్శలు

మంత్రి జి.వివేక్ మాట్లాడుతూ.. ప్రాణహిత--చేవెళ్ల పథకంలో తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించి ఉంటే గురుత్వాకర్షణ శక్తితోనే నీటిని అందించే అవకాశం ఉండేదని అన్నారు. అందుకు భిన్నంగా సుమారు 100 కిలోమీటర్ల దిగువకు వెళ్లి నీటిని పంపింగ్ చేసే విధంగా కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టడం సరైన నిర్ణయం కాదని విమర్శించారు. గత ప్రభుత్వ నిర్ణయాల వల్లే ప్రస్తుత సమస్యలు తలెత్తాయని ఆరోపించారు.

కేంద్ర నిధులపై తెలంగాణ సర్కార్ ఫోకస్: అధికారులకు సీఎస్ సంజయ్ జాజు కీలక ఆదేశాలు

(మొదటి పేజీ తరువాయి)

వినియోగించుకోవాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. నిధుల విడుదలలో జాప్యాన్ని నివారించాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉన్నతాధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును, నిధుల వినియోగాన్ని సీఎస్ సమీక్షించారు. లభ్యతలో ఉన్న నిధులను పూర్తిస్థాయిలో వాడుకోవడంపై అన్ని శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిధుల విడుదలకు అవసరమైన పరిపాలనాపరమైన ప్రక్రియలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శులతో నిరంతరం సమన్వయం సాధించడం ద్వారా నిధుల విడుదలలో ఎదురయ్యే అడ్డంకులను తొలగించుకోవాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. అవసరమైతే ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులతో తానే స్వయంగా చర్చిస్తానని, సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు.రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగవంతం చేసేందుకు కేంద్ర పథకాల ద్వారా గరిష్ట ప్రయోజనాలను పొందడమే లక్ష్యంగా ఈ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీనియర్ అధికారులు మహేశ్ దత్ ఎక్కా, దాన కిశోర్, రాహుల్ బొజ్జా, సందీప్ కుమార్ సుల్తానియా, యోగితా రాణా తదితరులు పాల్గొన్నారు.

వస్తోంది తుపాను కాదు.. అతి తీవ్ర తుపాను.. ఏపీకి ఐఎండీ హెచ్చరిక

(మొదటి పేజీ తరువాయి)

ప్రకారం.. ఆగ్నేయ, తూర్పు మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం వాయుగుండంగా మారింది. ఇది ప్రస్తుతం విశాఖపట్నానికి ఆగ్నేయంగా 820 కిలోమీటర్లు, కాకినాడకు 910 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఈ వాయుగుండం తొలుత దక్షిణ దిశగా కదిలి, అక్టోబర్ 25న తీవ్ర వాయుగుండంగా బలపడనుంది. ఆ తర్వాత దిశ మార్చుకుని పశ్చిమ-వాయవ్య దిక్కుగా ప్రయాణించి మరింత శక్తిని పుంజుకోనుంది.వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, ఈ వ్యవస్థ అక్టోబర్ 26 నాటికి తుపానుగా, 27 నాటికి తీవ్ర తుపానుగా, 28వ తేదీ ఉదయం నాటికి అతి తీవ్ర తుపానుగా మారుతుంది. అక్టోబర్ 28వ తేదీన ఉదయం 11:30 గంటల ప్రాంతంలో బాపట్ల-విశాఖపట్నం మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉంది. ఆ సమయంలో గాలి వేగం గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వరకు ఉండవచ్చని, గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగానికి చేరవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.తుపాను ఏర్పడటానికి, అది బలపడటానికి సముద్రంలో పరిస్థితులు అత్యంత అనుకూలంగా ఉన్నాయని వాతావరణ నిపుణులు విశ్లేషిస్తున్నారు. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు 29-30 డిగ్రీల సెల్సియస్ వరకు ఉండటం, మాడెన్-జూలియన్ ఆసిలేషన్ (వీజీఓ) వంటి వాతావరణ అంశాలు ఈ తుపాను తీవ్రతను పెంచేందుకు దోహదం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక వాతావరణ నమూనాలు (మోడల్స్) కూడా ఈ తుపాను ఏపీ తీరం వైపే వస్తుందని, అతి తీవ్రంగా మారుతుందని ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. కొన్ని నమూనాలు ఒడిశా లేదా తమిళనాడు వైపు సూచించినప్పటికీ, అందుకు అవకాశాలు తక్కువ అని భావిస్తున్నారు. ప్రస్తుత అంచనాల కచ్చితత్వంపై వాతావరణ శాఖ స్పందించింది. తుపాను మార్గం, తీవ్రతపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, సమాచారాన్ని అందిస్తామని తెలిపింది. తీరప్రాంత ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ సూచనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. తుపాను ప్రభావంతో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులు, సముద్రపు అలల ఉద్ధృతి ఎక్కువగా ఉండే అవకాశం ఉందని హెచ్చరించారు.

సీఎం విజయ్ కీలక నిర్ణయం.. ప్రశంసించిన కేంద్రం!

(మొదటి పేజీ తరువాయి)

చేకూరే అవకాశం

తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధినేత విజయ్ ప్రభుత్వానికి కేంద్రం నుంచి ప్రశంసలు లభించాయి. రాష్ట్రంలోని విమానాశ్రయాల్లో విమాన ఇంధనంపై విలువ ఆధారిత పన్ను (వ్యాట్) తగ్గిస్తూ తమిళనాడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్వాగతించారు. విమాన ప్రయాణాన్ని మరింత అందుబాటులోకి తీసుకురావాలంటే కేంద్రం, రాష్ట్రాలు కలిసి పనిచేయాలని పేర్కొన్నారు. పెరుగుతున్న ముడి చమురు ధరల నేపథ్యంలో విమానయాన సంస్థలకు ఈ నిర్ణయం కొంత ఊరటనివ్వనుంది. తమిళనాడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం.. చెన్నై విమానాశ్రయంలో విమాన ఇంధనం (ఏటీఎఫ్)పై వ్యాట్‌ను ప్రస్తుతం ఉన్న 29 శాతం నుంచి 16 శాతానికి తగ్గించారు. రాష్ట్రంలోని ఇతర విమానాశ్రయాల్లో ఈ పన్నును 29 శాతం నుంచి కేవలం ఒక శాతానికి తగ్గించారు. ఈ నిర్ణయం నవంబర్ 1 నుంచి అమల్లోకి రానుంది. 2027 అక్టోబర్ 31 వరకు ఈ పన్ను రాయితీ కొనసాగుతుంది. రాష్ట్రంలోని నగరాల మధ్య విమాన సర్వీసులను పెంచడం, విమానయాన సంస్థల నిర్వహణ ఖర్చులను తగ్గించడం ఈ నిర్ణయం వెనుక ప్రధాన లక్ష్యాలు. ఈ నిర్ణయంపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పందించారు. విమాన ఇంధనంపై వ్యాట్ తగ్గింపు విమానయాన రంగానికి స్వాగతించదగిన చర్య అని పేర్కొన్నారు. ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి విజయ్‌కు ధన్యవాదాలు తెలిపారు. విమాన ప్రయాణాన్ని మరింత చౌకగా మార్చేందుకు కేంద్రం, రాష్ట్రాలు సమన్వయంతో పనిచేయాలని, ప్రయాణికుల ప్రయోజనాలే ఉమ్మడి ప్రాధాన్యంగా ఉండాలని అన్నారు. ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో కూడా తమిళనాడు ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించింది. ముఖ్యమంత్రి విజయ్‌కు కృతజ్ఞతలు తెలిపింది. ఇలాంటి చర్యలతో విమాన మార్గాల అనుసంధానం మెరుగుపడుతుందని, రాష్ట్రంలో పర్యాటకం, ఆర్థికాభివృద్ధికి ఊతం లభిస్తుందని పేర్కొంది. విమానయాన రంగం మరింత బలోపేతం కావడానికి, విమాన ప్రయాణం ఎక్కువ మందికి అందుబాటులోకి రావడానికి ఇలాంటి నిర్ణయాలు దోహదపడతాయని అభిప్రాయపడింది. తమిళనాడులో విమాన ఇంధనంపై అధిక పన్నుల కారణంగా కొత్త విమాన సర్వీసులను ప్రారంభించేందుకు విమానయాన సంస్థలు ఆసక్తి చూపడం లేదన్న అభిప్రాయాలు గతంలో వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా కోయంబత్తూరు, సేలం వంటి పారిశ్రామిక నగరాల నుంచి మరిన్ని విమాన సర్వీసులు ప్రారంభించాలన్న డిమాండ్లు ఉన్నాయి. తాజాగా ప్రకటించిన పన్ను తగ్గింపుతో రాష్ట్రంలోని విమాన కనెక్టివిటీ మెరుగుపడుతుందని ప్రభుత్వం ఆశిస్తోంది. అయితే, ఈ నిర్ణయం వల్ల విమాన టికెట్ల ధరలు ఎంతమేర తగ్గుతాయన్నది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

ఏపీకి తుపాను గండం.. అధికారులతో చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

బంగాళాఖాతంలో తుపాను ఏర్పడే అవకాశముందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, అధికార యంత్రాంగానికి కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) అధికారులతో ఆయన సమావేశమై పరిస్థితిని అంచనా వేశారు.తూర్పు మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారింది. ఇది తుపానుగా మారే ప్రమాదం ఉందని అధికారులు సీఎంకు వివరించారు. దీని ప్రభావంతో రానున్న మంగళ, బుధవారాల్లో కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడొచ్చని అంచనా వేశారు. ఈ నేపథ్యంలో ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధంగా ఉండాలని చంద్రబాబు స్పష్టం చేశారు.ఈ సందర్భంగా సీఎం అధికారులకు పలు సూచనలు చేశారు. "తుపాను ప్రభావంతో తీరప్రాంతాల్లో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. అందువల్ల మత్స్యకారులు వేటకు సముద్రంలోకి వెళ్లకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే వెళ్లిన వారిని వెనక్కి రప్పించే ఏర్పాట్లు చేయాలి" అని ఆదేశించారు. తుపాను ప్రభావితమయ్యే జిల్లాల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే అప్రమత్తం చేసి, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రజలకు అత్యవసర సహాయం, సమాచారం అందించేందుకు వీలుగా ప్రతి జిల్లాలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని, టోల్ ఫ్రీ నంబర్లను అందుబాటులోకి తీసుకురావాలని చంద్రబాబు ఆదేశించారు. ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ వారిలో భయాందోళనలు తొలగించాలని, అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు.




రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.5 లక్షల వరకు నగదు రహిత వైద్యం





- పీఎం రాహత్ పథకాన్ని పకడ్బంబీగా అమలు చేయాలి: కలెక్టర్ సి. నారాయణ రెడ్డి



రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 24 నేటి వెలుగు ప్రతినిధి :

రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర వైద్య సహాయం అందించి, విలువైన ప్రాణాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం రాహత్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రమాద బాధితులకు పథకం నిబంధనల ప్రకారం ప్రమాదం జరిగిన తేదీ నుంచి ఏడు రోజుల వరకు ఒక్కొక్కరికి గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకు నగదు రహిత వైద్య చికిత్స అందించనున్నట్లు తెలిపారు.శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పీఎం రాహత్ పథకం అమలు, రోడ్డు ప్రమాదాల నివారణ తదితర అంశాలపై సమీక్షించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో నమోదయ్యే రోడ్డు ప్రమాద కేసులను సంబంధిత ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని, బాధితుల వివరాల ధ్రువీకరణలో పోలీసులు వేగంగా స్పందించాలని సూచించారు. ఆసుపత్రులు సమర్పించే చికిత్స ఖర్చుల క్లెయిమ్‌లను కలెక్టర్లు క్రమం తప్పకుండా పరిశీలించి, నిబంధనల ప్రకారం ఆమోదించాలని, ఆసుపత్రులకు చెల్లింపులు సకాలంలో జరిగేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేస్తూ బాధితులకు చికిత్స అందించడంలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని స్పష్టం చేశారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి, రహదారులపై భద్రతా లోపాలను సరిచేయడంతో పాటు అవసరమైన నివారణ చర్యలను తక్షణమే చేపట్టాలని సూచించారు. రవాణా, పోలీసు, వైద్య ఆరోగ్య, ఆర్ అండ్ బి, ఎన్‌హెచ్ఏఐ శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అన్ని శాఖలు నెలవారీ పురోగతి నివేదికలు అందజేస్తూ, రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు ప్రమాద బాధితులకు సకాలంలో వైద్య సహాయం అందేలా సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, ఆర్ అండ్ బి, రవాణా శాఖల అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

కూరగాయల సాగుతో అధిక లాభాలు పొందాలి: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్





నూతనకల్ అక్టోబర్ 24 నేటి వెలుగు ప్రతినిధి

ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న రైతులు ఆరుతడి పంటలైన కూరగాయలు సాగు చేసి అధిక లాభాలు పొందాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, అందించే రాయితీలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. నూతనకల్ మండలం లింగంపల్లి గ్రామంలో రెండు ఎకరాల్లో వంగ, మునగ తోటలు సాగు చేస్తున్న బోయపల్లి సరోజ వ్యవసాయ క్షేత్రాన్ని కలెక్టర్ సందర్శించారు. వంగ, మునగ సాగులో లాభనష్టాలను రైతును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించిన బిందు సేద్యం పరికరాలు ఎలా పనిచేస్తున్నాయి, ఎరువులను ఏ విధంగా అందిస్తున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కూరగాయల సాగు చేపడుతున్న రైతును అభినందించారు. అనంతరం అలుగునూరు శివారులో సాదు రామకృష్ణారెడ్డి 14 ఎకరాల్లో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటను సందర్శించి సాగు విధానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ పీడీ సన్యాసయ్య, జిల్లా ఉద్యాన శాఖ అధికారి తీగల నాగయ్య, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి, తుంగతుర్తి డివిజన్ ఉద్యాన అధికారి వి. ప్రమిత, మండల వ్యవసాయ అధికారి దివ్య, విస్తరణ అధికారులు ముత్యం రాజు, సుధాకర్‌రెడ్డి, రాము, ఆయిల్‌ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ భద్రాచలం, భవిష్య, తహసీల్దార్ హామీన్ సింగ్, ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్






ఆత్మకూర్ అక్టోబర్ 24 నేటి వెలుగు ప్రతినిధి:

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు పక్కాగా అందాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. ఆత్మకూర్(ఎస్) మండలం మిద్దనపల్లి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్, ప్రైమరీ హై స్కూల్ ను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లోకి వెళ్లిన కలెక్టర్, విద్యార్థులతో నేరుగా సంభాషించారు. పాఠ్యాంశాలపై వారిని పలు ప్రశ్నలు అడిగి, వారి సందేహాలను ఎంతో ఓపిగ్గా నివృత్తి చేశారు. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.అనంతరం పాఠశాలలోని వంట గదిను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యత, పారిశుద్ధ్య ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం పరిశుభ్రమైన, పౌష్టికాహారాన్ని మాత్రమే వడ్డించాలని, వంటకాల తయారీలో ఎలాంటి అలసత్వం వహించవద్దని నిర్వాహకులకు స్పష్టం చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను, రికార్డులను కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాఠశాలలో ఏవైనా మౌలిక సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి విశాల్, తహసిల్దార్ హమీన్ సింగ్, ఎంఈఓ ధారాసింగ్ ఉపాధ్యాయులు స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు

బడంగ్‌పేట్ కేంద్ర గ్రంథాలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి

- పాఠకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచన

బడంగ్‌పేట్ అక్టోబర్ 24 నేటి వెలుగు ప్రతినిధి



రంగారెడ్డి జిల్లా బడంగ్‌పేట్‌లోని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కె. కిరణ్మయి శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో పాఠకులకు అందిస్తున్న సేవలు, పుస్తకాల లభ్యత, అధ్యయనానికి కల్పిస్తున్న సదుపాయాలు, గ్రంథాలయ నిర్వహణ తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.గ్రంథాలయానికి వచ్చిన పాఠకులతో ఆమె నేరుగా మాట్లాడి, ముఖ్యంగా వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల చదువు, సన్నద్ధతపై ఆరా తీశారు. పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే క్రమశిక్షణతో చదవడం, సమయపాలన పాటించడం, నిర్దిష్ట లక్ష్యంతో నిరంతరం సాధన చేయడం ఎంతో ముఖ్యమని సూచించారు. అందుబాటులో ఉన్న పుస్తకాలు, అధ్యయన సామగ్రిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని అభ్యర్థులకు తెలిపారు.ప్రస్తుత అంశాలపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు, చదివిన అంశాలను క్రమం తప్పకుండా పునశ్చరణ చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత తమ భవిష్యత్తు లక్ష్యాలను సాధించడంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.అనంతరం గ్రంథాలయంలోని సౌకర్యాలు, పుస్తకాల లభ్యత, పాఠకులకు అందుతున్న సేవలు, అధ్యయన వాతావరణాన్ని పరిశీలించారు. గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ, నాణ్యమైన సేవలు అందించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.జి.వి. రాణి, గ్రంథాలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విధులకు హాజరుకాని 54 మంది లైసెన్స్ సర్వేయర్ల సేవలు రద్దు -- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి

రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 24 నేటి వెలుగు ప్రతినిధి:



రంగారెడ్డి జిల్లా పరిధిలో విధులకు హాజరుకాకుండా, షోకాజ్ నోటీసులకు స్పందించని 54 మంది లైసెన్స్ సర్వేయర్ల సేవలను తక్షణమే రద్దు చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి తెలిపారు.జిల్లాలో మొత్తం 281 మంది లైసెన్స్ సర్వేయర్లను నియమించగా, వారిలో 102 మంది విధులకు హాజరుకాకపోవడంతో షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. నోటీసులకు స్పందించి 48 మంది తిరిగి విధుల్లో చేరగా, ఎలాంటి స్పందన ఇవ్వని మిగిలిన 54 మంది సర్వేయర్ల సేవలను రద్దు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీ సర్వే కార్యక్రమంలో లైసెన్స్ సర్వేయర్ల పాత్ర అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రీ సర్వే పనుల్లో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాల్గొని, తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు.రీ సర్వే పనుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా, నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు సర్వేయర్లు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని స్పష్టం చేశారు. విధులకు గైర్హాజరు కావడం, అధికారుల ఆదేశాలను పాటించకపోవడం వంటి చర్యలను ఉపేక్షించబోమని హెచ్చరించారు. విధులకు హాజరుకాని సర్వేయర్ల స్థానంలో కొత్త లైసెన్స్ సర్వేయర్లను నియమించి, రీ సర్వే పనులు నిరంతరాయంగా కొనసాగేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మిగిలిన లైసెన్స్ సర్వేయర్లందరూ ఈ విషయాన్ని గమనించి, విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా అదనపు కలెక్టర్ సూచించారు.

33వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

సూర్యాపేట పట్టణం అక్టోబర్ 24 నేటి వెలుగు ప్రతినిధి:



సూర్యాపేట పట్టణంలోని 33వ వార్డు కౌన్సిలర్ నాగుల వాసు వార్డులో మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి రూ.5 లక్షల నిధులతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు నల్లగొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల శాసనమండలి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాదిలు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారులు, అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూ పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమం లో మున్సిపల్ కౌన్సిలర్ లు నాగుల వాసు, కొండపల్లి దిలీప్ రెడ్డి, చిలుముల సునీల్ రెడ్డి, పిల్లల రమేష్ నాయుడు , గుణగంటి హేమ సతీష్, నాయకులు అంజద్ అలి, వీరన్న నాయక్, కరుణాకర్ రెడ్డి, ఆలేటి మాణిక్యం అరవింద రెడ్డి తదితరులు పాల్గొన్నారు

డిఫాల్ట్ రైస్ మిల్లర్లకు 45 రోజుల గడువు

సూర్యాపేట జిల్లా అక్టోబర్ 24 నేటి వెలుగు ప్రతినిధి:

జీఓ ఎంఎస్ నెం. 17 ప్రకారం, డిఫాల్ట్ మిల్లర్లు బాకీ పడిన సీఎంఆర్ బియ్యాన్ని 45 రోజుల్లోపు ప్రభుత్వానికి చెల్లించాలి. బియ్యాన్ని సన్న బియ్యం రూపంలో ఇవ్వాలి, లేదా దానికి సరిపడా ధరను 25% పెనాల్టీ, 12% వడ్డీతో కలిపి చెల్లించాలి.కమిషనర్, సివిల్ సప్లైస్ ఆదేశాల మేరకు, 24.10.2026న జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధ్యక్షతన డిఫాల్ట్ రైస్ మిల్లర్లతో రివ్యూ మీటింగ్ నిర్వహించబడింది. ఈ సమావేశంలో సివిల్ సప్లైస్ టాస్క్ ఫోర్స్ ఓఎస్‌డి శ్రీ ప్రభాకర్ , అడిషనల్ కలెక్టర్ బి. హరి సింగ్ పాల్గొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన 45 రోజుల గడువును సద్వినియోగం చేసుకుని బాకీ ఉన్న సీఎంఆర్ బియ్యాన్ని అప్పగించాలని మిల్లర్లకు సూచించారు.గడువులోపు చెల్లించని మిల్లర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. రెవెన్యూ రికవరీ యాక్ట్, 1864 ప్రకారం వారి ఆస్తులను జప్తు చేస్తామని స్పష్టం చేశారు. జిల్లా సివిల్ సప్లైస్ అధికారులు, టాస్క్ ఫోర్స్ బృందం బకాయిలు చెల్లించని మిల్లులను ఇప్పటికే సందర్శిస్తున్నారు. మిల్లు యజమానుల, వారి కుటుంబ సభ్యుల ఆస్తి వివరాలను సేకరించడం ప్రారంభించారు. సమావేశం ముగిసిన వెంటనే ధనలక్ష్మి రైస్ మిల్ యజమాని గంగిరెడ్డి ఆదినారాయణ రెడ్డి తమ బాకీ మొత్తాన్ని 100% చెల్లించారు. ఆ మొత్తానికి చెక్కును జిల్లా మేనేజర్, సివిల్ సప్లైస్ వి. శ్రీధర్ రెడ్డి కి అందజేశారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి వి. మోహన్ బాబు , డిప్యూటీ తహసీల్దార్లు, టాస్క్ ఫోర్స్ బృందం కూడా పాల్గొన్నారు.



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్

పోలీస్ అమరవీరుల కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లవేళలా అండగా నిలుస్తుంది -- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్..

నల్గొండ జిల్లా అక్టోబర్ 24 నేటి వెలుగు ప్రతినిధి:



పోలీస్ అమరవీరుల కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లవేళలా అండగా నిలుస్తుందని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా 2 టౌన్ పోలీస్ స్టేషన్ ఏరియాలో శనివారం 1994 సంవత్సరంలో అడవిదేవులపల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ నక్సలైట్ల దాడిలో అమరులైన ఎస్ఐ లక్ష్మయ్య కుటుంబ సభ్యులను జిల్లా ఎస్పీ వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకొని, వారికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రజల రక్షణ కోసం, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడి అమరులైన పోలీసు వీరుల త్యాగాలు వెలకట్టలేనివని అన్నారు. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా విధి నిర్వహణలో సంఘవిద్రోహ శక్తులతో పోరాడుతూ 15 మంది పోలీసు సిబ్బంది అమరులయ్యారని గుర్తుచేశారు. వారి త్యాగాల ఫలితంగానే నేడు పోలీసు అధికారులు, సిబ్బంది ప్రశాంత వాతావరణంలో విధులు నిర్వహిస్తూ ప్రజలకు భద్రత కల్పించగలుగుతున్నారని పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబ సభ్యులు ఏ సమస్య ఎదుర్కొన్నా పోలీసు శాఖ దృష్టికి తీసుకురావాలని, వారికి అవసరమైన సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ రమేష్,నల్గొండ డిఎస్పీ శివరాం రెడ్డి,ఎస్బీ సీఐ నాగరాజు, 2 టౌన్ సీఐ ఆదిరెడ్డి,అడ్మిన్ ఆర్ఐ సంతోష్, 2 టౌన్ ఎస్. ఐ సైదా బాబు,అమరవీరుడు ఎస్ఐ లక్ష్మయ్య కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నల్గొండలో ప్రశాంతంగా ముగిసిన అసిస్టెంట్ సైంటిస్ట్ అనలిస్ట్ గ్రేడ్--2 పరీక్ష

పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్గొండ జిల్లా అక్టోబర్ 24 నేటి వెలుగు ప్రతినిధి



టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని నేతాజీ నగర్‌లో ఉన్న ఎస్పీఆర్ పాఠశాలలో నిర్వహించిన అసిస్టెంట్ సైంటిస్ట్ అనలిస్ట్ గ్రేడ్2 పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు.జిల్లాలో ఈ పరీక్ష కోసం ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయగా, ఉదయం నిర్వహించిన పరీక్షకు 185 మంది అభ్యర్థులకు గాను 122 మంది హాజరయ్యారని కలెక్టర్ వెల్లడించారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 185 మందికి గాను 117 మంది అభ్యర్థులు హాజరైనట్లు తెలిపారు.జిల్లా అధికారుల సమన్వయంతో పరీక్షను పకడ్బందీగా నిర్వహించినట్లు పేర్కొన్న కలెక్టర్, ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఉదయం పరీక్ష ప్రారంభమైన వెంటనే ఎస్పీఆర్ పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రం ఇన్‌చార్జి, జిల్లా పరిశ్రమల మేనేజర్ సతీష్‌ను అభ్యర్థుల హాజరు, పరీక్ష నిర్వహణకు సంబంధించిన ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పరీక్ష ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా, ప్రశాంత వాతావరణంలో ముగిసిందని తెలిపారు. పరీక్ష నిర్వహణలో సంబంధిత అధికారులు సమన్వయంతో వ్యవహరించారని పేర్కొన్నారు.

నల్గొండ పట్టణంలో లీగల్ మెట్రాలజీ, పౌర సరఫరాల శాఖల సంయుక్త తనిఖీలు -- నాలుగు కేసులు నమోదు

నల్గొండ పట్టణం అక్టోబర్ 24 నేటి వెలుగు ప్రతినిధి



నల్గొండ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, తేదీ 24-10-2026న నల్గొండ పట్టణంలోని బియ్యం దుకాణాలు, కిరాణా దుకాణాలు మరియు వంట నూనెల వ్యాపార సంస్థల్లో జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి, జిల్లా పౌర సరఫరాల అధికారులు మరియు డీటీ సివిల్ సప్లైస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో కలిసి సంయుక్త తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీలలో వ్యాపార సంస్థల్లో వినియోగిస్తున్న తూనికల పరికరాల ధృవీకరణ, ముద్రలు మరియు తూనికలు, కొలతలకు సంబంధించిన నిబంధనల అమలును పరిశీలించారు. వినియోగదారులకు సరైన తూకం అందించడం, వ్యాపార లావాదేవీల్లో పారదర్శకతను నిర్ధారించడం మరియు వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించడం ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశ్యం.తనిఖీల సందర్భంగా లీగల్ మెట్రాలజీ చట్టం, 2009 మరియు సంబంధిత నిబంధనలను ఉల్లంఘించిన వ్యాపార సంస్థలపై నాలుగు కేసులు నమోదు చేశారు.వ్యాపారులు ధృవీకరించి, ముద్ర వేయబడిన తూనికల పరికరాలను మాత్రమే వినియోగించాలని, వినియోగదారులకు సరైన తూకం అందించాలని, చట్ట నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.వినియోగదారులు తక్కువ తూకం, తప్పు కొలతలు లేదా ఇతర ఉల్లంఘనలను గుర్తించినట్లయితే సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు.

సమాజ అభివృద్ధిలో మహిళా జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకం: తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

హైద్రాబాద్ అక్టోబర్ 24 నేటి వెలుగు ప్రతినిధి:

నాంపల్లి మీడియా అకాడమీలో ఘనంగా అఖిల భారత మహిళా జర్నలిస్టుల సమ్మేళనం సాంస్కృతిక కార్యక్రమాలుహైదరాబాద్‌లోని నాంపల్లి మీడియా అకాడమీలో అఖిల భారత మహిళా జర్నలిస్టుల సమ్మేళనంలో భాగంగా నేడు సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ శాసన మండలి చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరై సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా మహిళా జర్నలిస్టులు శాసన మండలి చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి గారిని శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ...సమాజంలో మహిళా జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమైనదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా నాలుగో స్తంభంగా నిలుస్తుందని, ప్రజల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టులు విశేషమైన పాత్ర పోషిస్తున్నారని తెలిపారు.ముఖ్యంగా మహిళా జర్నలిస్టులు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ వృత్తిపట్ల అంకితభావంతో పనిచేయడం అభినందనీయమని పేర్కొన్నారు.మహిళలు నేడు విద్య, వైద్యం, సాంకేతిక పరిజ్ఞానం, పరిపాలన, రాజకీయాలు, మీడియా తదితర అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుకుంటున్నారని అన్నారు.దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళా జర్నలిస్టులు ఒకే వేదికపై సమావేశమై తమ అనుభవాలను, ఆలోచనలను పంచుకోవడం ఎంతో సంతోషకరమైన విషయమని తెలిపారు.తెలంగాణ రాష్ట్రం గొప్ప సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమని, బతుకమ్మ, బోనాలు వంటి పండుగలు తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకలని పేర్కొన్నారు.మన కళలు, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు.మహిళా జర్నలిస్టుల సమ్మేళనంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని, ఇటువంటి కార్యక్రమాలు దేశంలోని వివిధ ప్రాంతాల మధ్య సాంస్కృతిక అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.మహిళా జర్నలిస్టులు సమాజంలోని అసమానతలు, మహిళల సమస్యలు, సామాజిక అంశాలపై మరింత చైతన్యం తీసుకురావాలని ఆకాంక్షించారు.మహిళలు అన్ని రంగాల్లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, మహిళా జర్నలిస్టులు వృత్తిపరంగా మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ సమ్మేళన నిర్వాహకులకు, పాల్గొన్న మహిళా జర్నలిస్టులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.



పోలీస్ అమరవీరుల స్ఫూర్తితో రక్తదాన కార్యక్రమం.. రక్తదానం మహాదానం -- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్..





నల్గొండ జిల్లా అక్టోబర్ 24 నేటి వెలుగు ప్రతినిధి:

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా రక్తదాన కార్యక్రమాలు నిర్వహించగా, జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రక్తదానం అనేది ప్రాణదానంతో సమానమని, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఎంతోమందిని రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల ప్రధాన ఉద్దేశం దేశం కోసం, ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించి అమరులైన వారి త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. వారి స్ఫూర్తితో నిర్వహిస్తున్న రక్తదాన కార్యక్రమం ద్వారా ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేయడం ఎంతో గొప్ప విషయమని పేర్కొన్నారు.ఒకరు స్వచ్ఛందంగా ఇచ్చే రక్తం ప్రమాదాల్లో గాయపడిన వారికి, శస్త్రచికిత్సలు చేయించుకునే రోగులకు, ప్రసవ సమయంలో అధిక రక్తస్రావంతో బాధపడే మహిళలకు, ఇతర అత్యవసర వైద్య చికిత్సలు పొందుతున్న వారికి ఎంతో ఉపయోగపడుతుందని ఎస్పీ వివరించారు. రక్తానికి ప్రత్యామ్నాయం లేదని, అవసరమైన సమయంలో సకాలంలో రక్తం అందించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. రక్తదానం చేయడం వల్ల సమాజానికి సేవ చేయడంతో పాటు మానవత్వాన్ని చాటుకునే అవకాశం లభిస్తుందని అన్నారు.యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని, రక్తదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి మరింత అవగాహన కల్పించాలని ఎస్పీ సూచించారు. ఆరోగ్యంగా ఉన్న అర్హులైన వ్యక్తులు వైద్యుల సూచనల మేరకు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. రక్తదానం చేయడం వల్ల మరొకరి కుటుంబంలో ఆనందాన్ని నింపడంతో పాటు, ఆ కుటుంబానికి కొత్త ఆశను అందించినవారమవుతామని తెలిపారు.పోలీస్ అమరవీరుల స్ఫూర్తితో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చిన అమ్మ ఫౌండేషన్ సభ్యులు, యువజన సంఘాల ప్రతినిధులు, ఇతర యువతను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. సమాజ సేవ పట్ల యువత చూపుతున్న ఆసక్తి అభినందనీయమని, ఇలాంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, ఎస్బీ డీఎస్పీ మల్లారెడ్డి, నల్లగొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి, సీఐలు ఆదిరెడ్డి, నాగరాజు, శ్రీను నాయక్, మంజుల, ఆర్ఐలు సంతోష్, సూరపు నాయుడు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, అమ్మ ఫౌండేషన్ సభ్యులు, యువజన సంఘాల ప్రతినిధులు, యువత తదితరులు పాల్గొన్నారు.

మహిళలు విద్యావంతులైతేనే కుటుంబం, సమాజం అభివృద్ధి





- **తెలంగాణలోనే తొలిసారిగా ఫరూక్‌నగర్‌లో ఉర్దూ భాషా అభ్యసన కార్యక్రమం ప్రారంభం**
- **మార్చిలోగా 5,500 మందికి విద్య అందించడమే లక్ష్యం: వయోజన విద్యాశాఖ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి**

షాద్‌నగర్ అక్టోబర్ 24 నేటి వెలుగు ప్రతినిధి :

మహిళా అక్షరాస్యతను పెంపొందించి, ప్రతి ఒక్కరికీ విద్యను చేరువ చేయడమే ఉల్లాస్ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర వయోజన విద్యాశాఖ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణ పరిధిలోని ఫరూక్‌నగర్‌లో తెలంగాణలోనే తొలిసారిగా ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా ఉర్దూ భాషా అభ్యసన కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు విద్యావంతులైతేనే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. మహిళలు చదువుపై ఆసక్తి పెంచుకొని అక్షరాస్యత సాధించాలని పిలుపునిచ్చారు. ఫరూక్‌నగర్ మండలంలో వచ్చే మార్చిలోగా 5,500 మంది పురుషులు, మహిళలకు విద్య అందించాలనే లక్ష్యాన్ని పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ లక్ష్య సాధనకు అధికారులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.

మహిళల విద్యకు ప్రాధాన్యం

సెమినా మహిళా సేవా మండలి, ఆలియా సుల్తానా సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ అనిత, షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, ఫరూక్‌నగర్ తహసీల్దార్ నాగయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉర్దూ భాషా అభ్యసన పుస్తకాన్ని ఆవిష్కరించారు.మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ మాట్లాడుతూ మహిళల విద్యాభివృద్ధికి తన సంపూర్ణ సహకారం అందిస్తానని తెలిపారు. ఫరూక్‌నగర్‌లో ఉర్దూ భాషా అభ్యసన కార్యక్రమం ప్రారంభం కావడం సంతోషకరమని పేర్కొంటూ, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వెయ్యి మందికి ఉర్దూ నేర్పించడమే లక్ష్యం

ఆలియా సుల్తానా మాట్లాడుతూ తన సహకారంతో వెయ్యి మందికి ఉర్దూ భాష నేర్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఉర్దూ భాషను ప్రతి ఇంటికీ చేరవేసి, మహిళల్లో భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.కార్యక్రమంలో మహిళలకు విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. తమ పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం విద్యకు ప్రాధాన్యత ఇస్తామని మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది సబియా సుల్తానా, మెప్మా సిబ్బంది ఇబ్రహీం, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైన మహిళా జర్నలిస్టుల జాతీయ సదస్సు

హైదరాబాద్ అక్టోబర్ 24 నేటి వెలుగు ప్రతినిధి:

ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించడంలో, సమాజంలో అణగారిన వర్గాల గొంతుకను బలంగా వినిపించడంలో మహిళా ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ), మీడియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఇండియా (మెఫీ), తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని టూరిజం ప్లాజా హోటల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న మహిళా జర్నలిస్టుల జాతీయ సదస్సు శనివారం ఘనంగా ప్రారంభమైంది. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళా పాత్రికేయులు హాజరయ్యారు.జాతీయ సెమినార్ ప్రారంభోత్సవ సభలో రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క), హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షురాలు జస్టిస్ జి. రాధారాణి, మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ సుమతి (ఐపీఎస్) , తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, కర్ణాటక మీడియా అకాడమీ చైర్‌పర్సన్ ఆయేషా ఖానమ్, ఐ జె యు స్టీరింగ్ కమిటీ సభ్యులు డి.అమర్, ఎస్.ఎన్.సిన్హా, ఐజేయు అధ్యక్షుడు బల్వీందర్ సింగ్ జమ్మూ, సెక్రెటరీ జనరల్ డి.సోమసుందర్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె.రామనారాయణ హాజరయ్యారు. సీనియర్ జర్నలిస్టులు స్వప్న, టీయూడబ్ల్యూజే మహిళా విభాగం కన్వీనర్ రాజేశ్వరి కళ్యాణం, అత్తలూరి అరుణ, ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. నిజాలను నిగ్గుతేల్చడమే జర్నలిజం కర్తవ్యం: జస్టిస్ రాధారాణి సదస్సులో జస్టిస్ జి. రాధారాణి కీలక ఉపన్యాసం చేస్తూ... జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని . స్వతంత్ర పత్రికారంగం లేకుండా ప్రజాస్వామ్య మనుగడ సాధ్యం కాదని ఆమె పేర్కొన్నారు.ప్రశ్నించే తత్వమే పత్రికారంగానికి ప్రాణవాయువని, నిష్పాక్షికమైన వాస్తవాలను సమాజం ముందుంచడమే జర్నలిస్టుల కర్తవ్యమని అన్నారు. రాజ్యాంగంలోని అధికరణ 19(1)(ఎ) భావ ప్రకటనా స్వేచ్ఛను ప్రసాదిస్తే, అధికరణ 19(2) బాధ్యతాయుతమైన పరిమితులను నిర్దేశించిందని గుర్తుచేశారు. డిజిటల్ మాధ్యమాలు విస్తరిస్తున్న ప్రస్తుత తరుణంలో అసత్య ప్రచారాలు, డీప్‌ఫేక్, ఏఐ సాంకేతికత వల్ల విశ్వసనీయతకు ముప్పు వాటిల్లుతోందని, వాస్తవాల పరిశీలన (ఫ్యాక్ట్ చెకింగ్) ఎంతో అవసరమని సూచించారు. కార్యాలయాల్లో పని ప్రదేశ వేధింపుల నిరోధక (పోష్) చట్టాన్ని మీడియా సంస్థలు పక్కాగా అమలు చేయాలని, మహిళా జర్నలిస్టులకు తగిన రక్షణ, వృత్తిపరమైన సమాన అవకాశాలు కల్పించాలని పిలుపునిచ్చారు.

ప్రశ్నించే హక్కును ఎవరూ కాలరాయలేరు: మంత్రి సీతక్క

రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ... భయంతో ఏ మహిళా తన గొంతును నొక్కేసుకోకూడదని స్పష్టం చేశారు. చేతిలో మైక్ పట్టుకున్న మహిళ శత్రువు కాదని, సమాజ హితం కోసం నిలదీసే పాత్రికేయులు వ్యవస్థకు ఎన్నటికీ ముప్పు కారని ఆమె ఉద్ఘాటించారు. “మహిళల ప్రగతిని బట్టే ఆ సమాజ ప్రగతి ఆధారపడి ఉంటుందని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఏనాడో చెప్పారు. మేం రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసమే పోరాడుతున్నాం తప్ప, ఎవరి భిక్షనూ కోరడం లేదు” అని తేల్చిచెప్పారు. విధి నిర్వహణలో మహిళా జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, బెదిరింపులు, వ్యక్తిత్వ హననం వంటి చర్యలను తీవ్రంగా ఖండించారు. వృత్తిపరమైన హక్కుల పరిరక్షణ కోసం మహిళా జర్నలిస్టులంతా ఐక్యంగా పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు. న్యాయం కోసం నిలబడే శక్తి మహిళలకుంది: ఐపిఎస్ సుమతి మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ సుమతి (ఐపీఎస్) మాట్లాడుతూ... మహిళలు ప్రతి సమస్యను సమగ్ర కోణంలో విశ్లేషించే సామర్థ్యం కలిగి ఉంటారని, వారు కేవలం డెస్క్‌లకు మాత్రమే పరిమితం కాకుండా ఫీల్డ్ రిపోర్టింగ్‌లో ముందుండి నిర్భయంగా, నేతృత్వం వహిస్తూ ప్రజాస్వామ్యానికి సరికొత్త దిశానిర్దేశం చేయాలని కోరారు.మహిళలు అన్నిశీటిని అధిగమిస్తేనే ముందుకు వచ్చే పరిస్థితులు వుంటాయని వివరించారు. వివిధ రంగాలలో మహిళలు రాణించడం సాధారణ విషయం కాదని, అనేక అవాంతరాలను అధిగమించాల్సి ఉంటుంది అని చెప్పారు.కర్ణాటక మీడియా అకాడమీ చైర్‌పర్సన్ ఆయేషా ఖానమ్ మాట్లాడుతూ... న్యూస్‌రూమ్‌లలో మహిళా జర్నలిస్టులు తమ ప్రాధాన్యాన్ని నిరూపించుకోవాలని, సానుభూతితో కూడిన మానవీయ కథనాలను సమాజానికి అందించాలని పేర్కొన్నారు.అంతకుముందు ఐజేయూ అధ్యక్షుడు బల్వీందర్ సింగ్ జమ్ము ప్రారంభోపన్యాసం చేస్తూ క్షేత్రస్థాయిలో మహిళా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సవాళ్లు, సమస్యలను వివరించారు. ఇటీవల రీతిక చోప్రా వంటి జర్నలిస్టులు ఎన్నికల సంఘం, ఎస్ ఐ ఆర్ గురించి నిర్భయంగా కథనాలు రాసారని గుర్తు చేశారు.



Edited, Published and owned by **PAMANAGUDNDLA NAVEEN KUMAR,** Printed at **SRI printers** at H.No. 1-47/1, Ganesh Nagar, Dandampelly, Nalgonda , Telangana State : Editor, **PAMANAGUDNDLA NAVEEN KUMAR** : **RNI No. TELTEL 2023/88559**, Cell : **9553276552,**